# కూతురొచ్చినవేళ

నూతిగట్టుమీద కాకి కావుకావుమని అరిచింది.

ఆ కాకి అంట్ల గిన్నెలలోని ఏం చెంచానో ఏ చిన్న గిన్నెనో నోట కరుచుకుపోతుందేమోనని వర్ధనమ్మ 'హాట్‌హాట్' అంటూ తోలింది.

"అమ్మా! చుట్టాలెవరో వస్తారు కాబోలు" అంది వరలక్ష్మి.

"కరువులో అధికమాసం రాక రాక ఇప్పుడే రావాలా!" వర్ధనమ్మ. తనలో తను అనుకుంది. అయితే ఆమెకు అనుమానంగాను, భీతావహంగాను ఉంది.

నెలాఖరు రోజులు. ఇంటిలో దాదాపు అన్ని సామానులు నిండుకున్నాయి. కాఫీ పొడి డబ్బాలో అరచెంచాడుకన్నా ఎక్కువలేదు. పంచదార వంద గ్రాములైనాలేదు.

పోనీ అప్పుతెచ్చి అతిథులకు కాఫీలిచ్చి పంపించాలనుకున్నా ఇరుగూపొరుగూ వున్నా ఏం ప్రయోజనం? ఏదైనా వస్తువు బదులడగడానికి వెళ్తే మొండిచెయ్యి చూపిస్తారు. సరే పైగా లెక్చర్లిస్తారు.

ఉన్నవాళ్లకి లేనివాళ్లు లోకువే. అందుకనే ఉంటే తినటం లేకుంటే పస్తులుండటం అలవాటు చేసుకున్నారు. తనూ తన పిల్లలైతే గుట్టుగా మంచినీళ్లు తాగి వుండగలరు. చుట్టాలొస్తే కుదిరేదా?

మాలతి!

వర్ధనమ్మకు పెద్ద కూతురు జ్ఞాపకం వచ్చింది. ఆమె కళ్ళు తడి ఆయ్యాయి. పిచ్చిపిల్ల. ఈ ఇంట్లో ఎన్ని అవస్థలు పడింది. తమ ఇంటికి వచ్చేవాళ్లు తక్కువైనా అప్పుడప్పుడు ఎవరో ఊడిపడే వారు.

చుట్టాలన్నా వాళ్ళ రాకపోకలన్నా సందడిగాను సంతోషంగాను ఉంటుంది. కాని గొర్రెతోకలా ఎదుగూబొదుగూ లేని జీతం రోజురోజుకి ఆకాశాన్ని అంటే ధరలు ఇల్లు గడవటం కష్టం.

అతను మాత్రం ఏం చేస్తాడు? అప్పటికీ ఉద్యోగంతోపాటు రాత్రి పొద్దుపోయేవరకు పార్టు టైము చేసినా రెక్కలు ముక్కలవడమే గాని ఈ భవసాగరాన్ని ఈదే స్తోమత ఏదీ?

మాలతిని బ్రతిమాలితే పదిళ్ల తరువాత ఉన్న శ్యామలమ్మగారింటి నుండి కాఫీపొడి, పంచదారా తెచ్చేది.

చిన్నపిల్ల మాటిమాటికి వెళ్లి అడగడానికి సిగ్గుపడినా పరిస్థితులను అర్థంచేసుకునేది. అది ఉన్నంతకాలం చుట్టాలొచ్చినా పెద్దగా ఇబ్బంది ఉండేదికాదు.

వరలక్ష్మి ఉంది. ఎందుకు? ఛీ! మాటిమాటికీ వెళ్లి తేలేను. వాళ్ళేమనుకుంటారు? అంటుంది. అది తప్పు అనటంలేదు. కాని పరిస్థితులు అలాంటివి. బ్రతిమాలినా ప్రయోజనం ఉండేదికాదు.

వరలక్ష్మి అన్నట్లు ఇప్పుడు చుట్టాలెవరైనా వస్తే? ఆమెకు దిగులు పట్టుకుంది. కనీసం కాఫీ ఇచ్చైనా సాగనంపడం కుదరదు. కిరాణాదుకాణంవాడు మాత్రం ఎంత అరువు ఇస్తాడు?

"ఇప్పుడొచ్చే చుట్టాలెవరుంటారు? అంట్లగిన్నెలున్నాయిగా. మెతుకుల కోసం వచ్చింది. తన తోటివాళ్లను విందుకి ఆహ్వానిస్తుంది." అంది కూతురితో వర్ధనమ్మ.

"ఏమండీ! కాఫీగుండా పంచదారా నిండుకున్నాయి." భయపడుతూనే చెప్పింది.

ఆమెకు తెలుసు అతని దగ్గర ఎర్రని ఏగాణీలేదు. షావుకారు మరి ఈ నెలలో అప్పు ఇచ్చేది లేదని ముందే చెప్పాడు. చేబదుళ్లు మాత్రం ఎక్కడని చేయగలరు? తెలిసినవాళ్ళందరకూ ఎంతో కొంత బాకీపడ్డారు.

చుట్టాలు రాకుంటే బాగుండు ననుకుంది వర్ధనమ్మ. రెండురోజులు కళ్లు మూసుకుంటే మొదటి తారీకు వస్తుంది. కానీ...

ఇప్పుడు కొత్త చుట్టాలు కలిశారు - మాలతి పెళ్ళితో. మాలతి అత్తవారి తరఫునవాళ్లు వస్తే? కాఫీ అయినా ఇవ్వకపోతే ఎంత అప్రతిష్ఠ?

మాలతి అదృష్టవంతురాలు. దాని పెళ్ళి ఎలాగ చెయ్యడం అని బాధపడవలసి రాలేదు. కానీకట్నం లేకుండా వాళ్లు మాలతిని చేసుకున్నారు. మాలతి అత్తమామలలాంటివారే అందరూ అయితే ఆడపిల్లల తల్లిదండ్రులకు అగచాట్లు వుండవు.

విశ్వనాథం భార్య యిచ్చిన కాఫీ తాగాడు. తను చెప్పింది అతను వినలేదా? మళ్లీ ఎలా చెప్పటం? ఆమె ఆలోచించసాగింది.

"అప్పు దొరికితే సాయంత్రం తెస్తాను.... లేదా.." భార్యకు జవాబిచ్చి అతను వెళ్లిపోయాడు.

ఆందోళనతోనే మూడుగంటలు గడిచాయి. అన్యమనస్కంగానే వంటపూర్తిచేసింది.

"అమ్మా! ఎవరొచ్చారో చూడు" అంది వీధిలోంచి వరలక్ష్మి.

ఆ అరుపు పిడుగుపాటులా తగిలింది వర్ధనమ్మకు. ఏది కాకూడదని ఇంతసేపై భగవంతుడ్ని కోరుకుందో అదే జరిగింది.

పోనీ భోజనాల వేళప్పుడు వచ్చారు - అన్నం పెడదామా అంటే పచ్చడి ఊరగాయ, చారు తప్ప మరో అధరువులు లేవు.

"అమ్మా! మాలతక్క వచ్చింది" అప్పటికి ఇద్దరూ వసారా దాటి వస్తున్నారు.

వర్ధనమ్మ ముందుగా ఆందోళన చెందినా వొచ్చింది తన కూతురేనని తెలుసుకుని ఆమె ఆనందించింది.

ఆమె ఉల్లంలోని ఆనందం ఎంతోకాలం నిలవలేదు. ఆ వచ్చింది తనకూతురే కాదు. ఏ.ఇ. ప్రకాశ్‌రావు భార్య. రాక రాక వచ్చిన కూతురికి పచ్చడి మెతుకులా తను పెట్టబోయే విందు భోజనం.

"ఏమమ్మా!! ఉత్తరమైనా రాయకుండా వచ్చావు? అంత కులాసాయేనా?"

ఆరునెలల క్రితం అత్తవారింటికి వెళ్లిన కూతురు ఉత్తరం పత్తరం లేకుండా వచ్చింది.

ఈ రాక వెనుక కారణం ఏమిటి? ఆమె గాబరా పడింది. ఏమో ఎందుకు వచ్చిందో కట్టుబట్టలతో వచ్చింది. పెట్టేబేడా లేవు.

"వరాలూ! నాన్నగారిని పిలుచుకు వస్తావా? నువ్వు వెళ్లొద్దు. రమణమ్మగారి రాముని పంపించు" అంది.

అయితే తల్లి మాటలు వినడానికి అక్కడ వరాలులేదు.

"ఈ పిల్ల ఏదీ?" అని వర్ధనమ్మ అనుకుంటూ వుండగానే పాత కావిడిపెట్టెలోని ఉతికిన రంగుల దుప్పటితెచ్చి వంటింటిలో గోడవారగా వేసి "కూర్చో అక్కా" అంది వరలక్ష్మి.

ఆ దుప్పటిని చూడగానే గతం గుర్తుకొచ్చి మాలతి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఔను! ఈ దుప్పటి అతిథులకోసం ప్రత్యేకంగా వుంచినది. ఆరేళ్ల క్రితం తనేకొంది. అప్పుడు ఎనిమిది పాసై తొమ్మిదిలోనికి వచ్చింది తను.

అన్ని విషయాల్లో మంచి మార్కులు తెచ్చుకొని స్కూలికి ఫస్టు వచ్చింది. బహుమతిగా పుస్తకాలకని స్కూలువాళ్లు యాభైరూపాయలిచ్చారు.

చుట్టాలొస్తే వాళ్ళకని తమ ఇంటిలో కుర్చీలూ సోఫాలు లేవు. మంచంమీద బొంత వేసినా వాడుతున్న దుప్పటివేసినా వికారంగాను అసహ్యంగాను వుండేవి.

అమ్మా, నాన్నా 'ఆ డబ్బుతో దుప్పటి కొనకు. పుస్తకాలే కొనుక్కో' అంటున్నా లెక్కచేయకుండా తానే బజారుకెళ్లి ఈ ముద్దులొలికే దుప్పటి కొంది.

ఎవరైనా అతిథులొస్తే తానే మంచం వాల్చి దుప్పటి వేసేది.

ఈ రోజు తన సొంత చెల్లెలు తనను తన ఇంటిలో చుట్టంలా చూస్తోంది.

తల్లికీ చెల్లెలికీ కనిపించకుండా తను పక్కకు తిరిగి కళ్లు వత్తుకుంది.

తల్లి చిన్న కూతురి చెవిలో ఏదో చెప్తోంది. "నావల్లకాదు" అది మొండిగా జవాబు చెప్పింది.

"నా తల్లివికదూ! ఈ ఒక్కమారు చేసిపెట్టు. మరెప్పుడూ చెప్పనులే" ఈ పర్యాయం తల్లి మాటలు మాలతికి వినిపించాయి, ఆమె ఎంత మెల్లిగా అన్నా.

ఈ ఇల్లు తనకు కొత్తదికాదు. ఎవరి మనసులో ఏముందో తాను గ్రహించలేకపోలేదు. నెలాఖరు రోజులు. కాఫీపొడో, పంచదారో లేక రెండూనో అయిపోయింటాయి.బదులు తెమ్మని చెల్లెలితో తల్లి అంటోంది.

దానికి అలా తేవటం చిన్నతనం. అందుకే ఖరాకండిగా నా వల్లకాదు అంది. అయినా తనేం పరాయిదా? కాఫీ ఇవ్వకపోతే బాధపడుతానా? నిష్ఠూరమాడతానా? తననెందుకు పరాయిదానిలా చూస్తున్నారు?

వాళ్ళతోపాటు తనుకూడా కాఫీ లేకుండా అన్నమైనా తినకుండా ఎన్నెన్ని రోజులుండలేదు? తను ఆ రోజులు మరిచిపోగలదా? కన్యాదానం చేసి అత్తవారింటికి పంపినంత మాత్రాన తను పరాయిదైందా?

"నువ్వు నీళ్లు పడేయి. ఈలోగా నాన్నగారికి కబురు చేయమని చెప్పి వస్తాను" అంది వర్ధనమ్మ చిన్నకూతురితో.

అమ్మ ఎక్కడికెళ్తుందో తెలుసు. ఆపాలనుకుంది. అయితే ఆమెను బాధపెట్టలేదు. అయ్యో! వెలితి చేశామే అని అమ్మ బాధపడుతుంది.

వరలక్ష్మి కుంపటిలో నాలుగు బొగ్గులువేసి విసిరింది. రాజుకున్న తరువాత కప్పు నీళ్లు పెట్టింది.

తనెందుకు వచ్చింది?

నాలుగు క్షణాలు సరదాగా వీళ్లతో గడపాలని కదూ? అత్తవారింటిలో తనకు లభ్యమైన ఆదరణా ఆత్మీయతా వీళ్ళకు సముఖంగా చెప్తే విని ఆనందిస్తారని వచ్చింది. కానీ వీళ్లు...

ఆమెకు గడిచిన దినాలు గుర్తుకొచ్చాయి.

అమ్మకు, నాన్నకు బంధుప్రీతి మెండు. అయితే ఆదరించలేని అసమర్థులు.

ఇలా వేళగానివేళ ముఖ్యంగా నెలాఖరు రోజులో ఎవరైనా వస్తే యమయాతనగా వుండేది. అది సహజమే.

అందుకే అమ్మ విసుక్కునేది – 'ముహూర్తం చూసి వీళ్లు ఇప్పుడే ఊడిపడాలా? నాలుగు రోజులు ముందు వచ్చినా, నాలుగు రోజులు ఆగి వచ్చినా వాళ్లను గౌరవించేవాళ్లం. ఇప్పుడు చిప్ప చేతిన పట్టుకొని ముష్టికి బయలుదేరాలి.'

కొంపతీసి ఈనాడూ కూడా తన రాకతో తల్లి ఇలాగే అనుకొంటుందా? మాలతికి తన తప్పు తెలిసివచ్చింది. తను పొరపాటు చేసింది. ఇరవై తొమ్మిదో తారీఖు రాకుండా వుండవలసింది.

ఆవకాశం దొరికిందని ఆశపడి వచ్చింది. తనకేం తెలుసు వీళ్లు పరాయిదానిలా గుర్తిస్తారని. ఊహించలేదు.

"చెల్లీ! ఇప్పుడెవరికే కాఫీ!? నాన్నగారు రాగానే ఏకంగా భోజనం చేయవచ్చుగా" అంది చెల్లెలు దగ్గరకు వెళ్ళి. నీళ్లు కుతకుత మరుగుతున్నాయి.

"మీరిద్దరూ కూర్చోండి. కాఫీ కలిపి తెస్తాను." అంది వర్ధనమ్మ అప్పుడే తిరిగివచ్చి.

ఇద్దరు కూతుళ్ళకు కాఫీలిస్తూ "ఏమే నేనడిగిన దానికి సమాధానం చెప్పలేదు. ఉత్తరమైనా రాయకుండా ఇలా వచ్చావు?" తిరిగి ప్రశ్నించింది.

నువ్వు అవకాశం యిచ్చావా! నాన్నగారికి కబురు పెడతానంటూ వెళ్ళి ఇప్పుడు వచ్చీ కాఫీ కలిపి తెస్తున్నావు.

ఏమీలేదు. వారు స్నేహితుని పెళ్లికి పార్వతీపురం బయలుదేరారు. 'మాలతి నేను జీపులో పార్వతీపురం వెళ్తున్నాను. ఈ రాత్రికే తిరిగి వస్తాను. దారిలోనే కదా మీవాళ్ల ఊరు. నువ్వూ వస్తావా? వెళ్లినప్పుడు నిన్ను అక్కడ దింపి వచ్చేటపుడు పికప్ చేస్తాను' అన్నారు.

'చాలా రోజులైంది మీవాళ్లను వదిలేసి. చూసిరా' అని మా అత్తగారు ప్రోత్సహించారు. అలా అనుకోకుండా బయలుదేరాను" అంది నవ్వుతూ.

"అయ్యో అతగాడు వచ్చాడా? మరి ఇంతవరకు ఇంటిలోనికైనా రాలేదా? అయ్యో ఈ బీదవాళ్లు తనకేం పెడతారని అనుకున్నాడా? కనీసం కాఫీ నీళ్ళైనా తాగి వెళ్లవచ్చుగదా" అంది నొచ్చుకుంటూ.

"అదేం కాదు అమ్మా! దారిలో ఒక స్నేహితుడు కలిశాడు. మేం హోటల్లో కాఫీ తాగేం. లగ్నంవేళ అయిపోతున్నాదని ఆగకుండా వెళ్లిపోయారు. సాయంత్రం వస్తారుగా" అంది.

"అయ్యో! మా ఊరొచ్చి బయట హోటళ్లో కాఫీతాగేదా? ఎంత అప్రతిష్ఠ మాకు" అంది వర్ధనమ్మ.

"అయితే ఈ రోజే తిరుగు ప్రయాణమా? ఒక్క పూటైనా వుండరా?" అంది.

"ఆ షరతు మీదే మా అత్తగారు పంపించారు. మా ఇంటికీ అక్కడ చుట్టాలొచ్చారు. నేను లేకపోతే మా అత్తగారు బిక్కుబిక్కుమంటారు. అందుకే మరో చీరనైనా తోడపట్టుకురానీయలేదు" అంది మాలతి.

భార్య పంపిన కబురు విని విశ్వనాథం ఒక వంక కూతురు వచ్చిందని సంతోషించినా ఎందుకు వచ్చిందో తెలియక గాబరాపడ్డాడు.

మాలతి అత్తవారు మంచివాళ్లే. అప్పుడు 'మీ పిల్ల కావాలి కానీ కట్నకానుకలు కాదు' అన్నారు. మాట నిలుపుకున్నారు.

ఇప్పుడు టి.వి.యో, మోటరుసైకిలో కావాలని ఆశపడటంలేదుగా? ఆ మిషతోనే అమ్మాయిని పుట్టింటికి తగిలేశారా?

ఏమో? ఏ పుట్టలో ఏ పాముందో ఎలా తెలుస్తుంది? అది వచ్చిందిగా - తెలియకుండా వుంటుందా?

తన భార్యకలాంటి అనుమానం కలిగేగా కబురు పంపింది.

విశ్వనాథం తిన్నగా ఇంటికి రాలేదు. ఇద్దరు ముగ్గురు మిత్రుల్ని కలిశాడు.కనీసం పాతిక రూపాయలు అప్పు అడిగాడు.

పరిస్థితి తెలుసుకున్న ఒకతను యిచ్చాడు.

కూరా నారా, కాఫీపొడి, పంచదార మరికొన్ని వస్తువులు క్లుప్తంగా కొన్నాడు. అరడజను చక్రకేళీ అరటిపళ్లు కొన్నాడు.

"అమ్మాయి వచ్చిందండీ! అది ఈ సాయంత్రమే వెళ్ళిపోతుందట" అంటూ కూతురు చెప్పినవి భర్త చెవిలో వేసింది.

తన అనుమానం నిజం కానందుకు సంతోషించాడు. వాళ్లను నిష్కారణంగా అపార్థం చేసుకున్నందుకు బాధపడ్డాడు.

భర్తకూ ఇద్దరు పిల్లలకు వడ్డించింది. తల్లి తనకు ప్రత్యేకంగా వెండి కంచంవేసి, చెల్లెలికి, నాన్నగారికి అరటాకులు వేస్తే మాలతికి ఆ సామెత గుర్తొచ్చింది. 'అయినవాళ్ళకు ఆకుల్లోనూ కానివాళ్లకు కంచాల్లోను' తను ఈ ఇంట పరాయిదే.

"వర్ధనీ! అమ్మాయికి ఇష్టమని చక్రకేళీ అరటిపళ్లు తెచ్చాను. తెచ్చి ఇయ్యి" అన్నాడు విశ్వనాథం.

ఈ అరటిపళ్లు అంటే తనకు మహాప్రీతి. జ్ఞానం తెలియని రోజులలో వాటికోసం తను మారాం చేసేది. తల్లి తనను చీవాట్లు పెట్టేది.

అయితే ఆ తరువాత ఆమె ఈ చిన్న కోరికకూడా తీర్చలేనందుకు రోదించింది. ఆ తరువాత తనే వాటి మాట మరిచిపోయింది. మరి ఈ పళ్లు కొనడానికి నాన్నగారు ఎవరి దగ్గర అప్పు తెచ్చారో?

"అయ్యో! నువ్వు వస్తావని తెలిస్తే బంగాళాదుంపల కూరా, ఉల్లిపాయలు వేసి పప్పుపులుసు చేసి వండేదాన్ని. ఇప్పటికే వేళ మించిపోయింది. సాయంత్రం అన్నీ వండి పెడతాను" అంది వర్ధనమ్మ.

"అమ్మా! రాత్రికే ఇంటికి వెళ్లిపోతాం. సందెవేళ ఏం భోజనాలు చేస్తాం. నువ్వు హైరానాపడకు" అంది మాలతి. అయితే తల్లి తన మాటలు పెడచెవిని పెడుతుందని ఆమెకు తెలుసు.

రోజూ రెండు రకాల కూరలు, పప్పూ, పెరుగుతో తింటోంది. అయినా అమ్మ పెట్టిన ఈ పచ్చడి మెతుకులు బాగున్నాయి. ఏమైనా తను వాళ్లకు పరాయిది. అందుకే ఏ ఆధరువులులేని భోజనం పెట్టినందుకు తల్లి నొచ్చుకుంది.

"తల్లీ! ప్రయాణం చేసి అలసిపోయి వుంటావు. గదిలో మంచంవేశాను. ఒక కునుకు తియ్యి" అంది.

తను పడుకోవడానికి వచ్చిందా? ఈ నాలుగు గంటలూ సరదాగా గడపాలనుకుందే! వీళ్లు తనతో కబుర్లు చెప్పరేం?

"ముప్పావు గంట జీపు ప్రయాణానికే అలసిపోయానా? నేను నిద్రపోలేను" అని తల్లితో అని "చెల్లీ! గులాబి చెట్లు పూస్తున్నాయా?" అడిగింది మాలతి.

అక్కడ డిపార్టుమెంటువాళ్లు ఇచ్చిన బంగళాలో రకరకాల చెట్లున్నాయి. తోటమాలి సేవ వలన ఎప్పుడూ రంగురంగుల పూలు పూస్తాయి.

అయితే ఈ ఇంటిలో తాను నాలుగైదు రకాల గులాబీ కొమ్మలు గత వర్షాకాలంలో నాటింది. అవి అప్పుడే చిగుర్లు తొడిగాయి. బహుశా ఇప్పుడు పూస్తూ ఉంటాయి.

"అక్కయ్యా! బాగా పూస్తున్నాయి. నీ చేతుల్తో వేసినవి. చూస్తావా?" అంది వరలక్ష్మి.

"పద" అంటూ లేచింది మాలతి.

"వరాలూ! నీకు మతిలేదా? ఇంత ఎండలోనా? కొంచెం చల్లబడనియ్. ఆ చెట్లు పువ్వులూ ఎక్కడికి పోవు" అంది తల్లి.

తను ఎండలో కందిపోతా ననుకుంటున్నది.

"వరాలూ! అలా నిలుచుండకపోతే అలా పక్కవాళ్ల ఇంటిలోంచి నాలుగు వారపత్రికలు తేరాదూ? అక్కయ్య చదువుతుంది" అంది తల్లి.

పొరుగిళ్లనుండి పుస్తకాలు తేవటం తల్లికి బొత్తిగా యిష్టంలేదు. అయినా తనకోసం తెప్పిస్తున్నది.

సాయంత్రం వంటకు ప్రయత్నాలు మొదలయ్యాయి. పప్పు రుబ్బమని చెల్లెలికి పురమాయించింది.

తాను రుబ్బుతానంటే "అయ్యో! నీకెందుకే శ్రమ. మేం లేమా' అంది ఆమె.

ఆకులు తీసి ఎంగిళ్లు ఎత్తబోతే వారించింది. అక్కడ అత్తవారింటిలోనూ తనను అపురూపంగా చూసుకుంటారు. బరువైన పనులు అసలు చేయనీయరు.

ఈ ఆత్మీయతను, ఆదరణనూ, ఈ అభిమానాన్ని భరించడమే కష్టంగా వుంది.

సాయంత్రం నాలుగు గంటలకల్లా వేడివేడి పకోడీలు కాఫీ తెచ్చి యిచ్చి "ఇప్పుడు చెప్పమ్మా!

అక్కడ నీకే లోటు లేదుగా! అహర్నిశలూ నీవే నా కళ్ళకు కనిపిస్తూ వుంటావు" అంది వర్ధనమ్మ.

అమ్మయ్య! ఇప్పటికి తను అమ్మకు గుర్తుకొచ్చింది. దుఃఖం వచ్చింది. అయితే తను ఏడుస్తే అమ్మ వేరే విధంగా భావించే అవకాశం ఉంది.

వీధిలో జీపు ఆగిన శబ్దం, ఆ వెనుక హారన్ మోత.

"అమ్మా! మీ అల్లుడుగారు వచ్చారు" అంది వీధి గుమ్మంవైపు నడుస్తూ.

"రావోయ్ ప్రకాశం రా! నువ్వు భోజనాలవేళ వచ్చి కూడా భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయావు. మీ అత్తగారు చాలా నొచ్చుకుంది" అన్నాడు విశ్వనాథం.

"అదేంకాదు మామయ్య! పెళ్లికి వెళ్ళాను. మరి అక్కడ భోజనం చెయ్యాలిగా" నవ్వుతూ అన్నాడు ప్రకాశం.

"ఏమండీ! అతన్ని జీపు దిగనివ్వండి. ఏం అలాగే పంపేస్తారా?" అంది వర్ధనమ్మ.

"ఔనోయ్! నువ్వు సాయంత్రం వస్తావని అమ్మాయి చెప్పింది. అందుకే మీ అత్తగారు వంట చేసింది. ఇక్కడ భోజనం చేసి రాత్రికి వుండి వెళ్లండి" అన్నాడు విశ్వనాథం.

"మాలతి చెప్పలేదా మామయ్య! మేం వెంటనే బయలుదేరాలి. అయినా నేను భోజనం చేసి ఇంకా గంట కాలేదు. ఇప్పుడేం చేస్తాను?" మామగారితో అని, "మాలతీ నీదే ఆలస్యం" అన్నాడు.

"నేను రడీయే" అంది మాలతి

"అదేమిటి! మా ఇంట ఒకపూట అన్నమైనా తినకుండా వెళ్లిపోతాడా? ఆ మాత్రం దానికి రావటం ఎందుకు? అత్తగారింటిలో భోజనమైనా పెట్టలేదు అని నలుగురూ అనుకోవాలనా?" అంది నిష్ఠూరంగా.

"అమ్మా! నీకు ముందే చెప్పాను. అయినా నా మాట వినక నువ్వు హైరానా పడ్డావు. మళ్ళీ మారు నాలుగు రోజులు వుండేలాగే వస్తాం" అంది తల్లితో.

జీపు ఎక్కేముందు "చెల్లీ! ఈ రంగు చీర నీకు బాగుంటుందని మీ బావగారు కొన్నారు" అంటూ తన చేతిలోని పేకెట్టు చెల్లెలికి యిచ్చింది.

మాలతికి బాధగానే వుంది. తనూ బంధువులా వారింట ఒకపూట భోజనం చేసి బదులుగా చెల్లెలికి ఒక చీర యిచ్చింది.

ఆడపిల్ల పెళ్ళయిన తరువాత కన్నవారికే పరాయిదౌతుంది. తల్లీబిడ్డల మధ్య అనురాగం వున్నా, మధ్య ఒక తెర - జరీతెర.

పెళ్లి అయిన ఆడపిల్లలకు ఈ జరీతెర తప్పదు కాబోలు. తను ఏం ఆశించి వచ్చింది! అయితే జరీతెర మధ్యలో వచ్చి తన ఆశను కూకటివేళ్ళతో తుంచేసింది. కన్నీళ్లతో జీపు ఎక్కింది మాలతి.

**(స్వాతి - సపరివారపత్రిక - 15.2.1991)**